క్లుప్తంగా

ఉద్యోగులకు భద్రత కల్పించాలి

నిజామాబాద్‌నాగారం: మున్సిపల్ కార్మికులపై, ఉద్యోగులపై దాడులను అరికట్టి, భద్రత కల్పించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ అలీమ్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల గోవర్ధన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులపై, ఉద్యోగులపై భౌతిక దాడులకు దిగటం సరికాదన్నారు. నగరంలోని మాల పల్లిలో చెత్త సేకరణ చేస్తున్న డ్రైవర్ జగదీర్‌పై స్థానిక పండ్ల షాపు యజమాని, అతని అనుచరులు దాడి చేసి గాయపరచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిని అరెస్టు చేయాలన్నారు. నాయకులు చంద్రసింహ, నర్సింగరావు, రవికిరణ్, భూపతి, ఏక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ అందజేత



ధర్పల్లి(ఇందల్‌వాయి): ఇందల్‌వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన పలు బాధిత కుటుంబాలకు బుధవారం సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీని రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అందజేశారు. సర్పంచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ధర్పల్లి(ఇందల్‌వాయి): ఇందల్‌వాయి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం చలివేంద్రంను ఎంపీటీసీ చింతల దాసు ప్రారంభించారు. ప్రయాణికులు కోసం ఆర్టీసీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు కంట్రోలర్ తెలిపారు.

కార్మికులకు కాంగ్రెస్ అండగా ఉంటుంది



నిజామాబాద్‌నాగారం:కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్‌పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తెలిపారు. జిల్లాలో పర్యటిస్తున్న రేవంత్ రెడ్డిని బుధవారం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు,జిల్లా నాయకులు 327 జిల్లా ప్రధాన కార్యదర్శి పుదరి గంగాధర్, ఎడ్ల నాగరాజు కలిసి సత్కరించారు.కార్మికుల సమస్యలను విన్నవించారు. నాయకులు గంగాధర్, వేణుగోపాల్, పెంటచారి, కార్తీక్, మొహినొద్దీన్, శ్రీనివాస్, భూమేష్, అసిఫ్, నాంపల్లి తదితరులున్నారు.

మహిళా రైతులకు సన్మానం



సిరికొండ: మండలంలోని రావుట్ల, నారాయణ పల్లి గ్రామాలకు చెందిన మహిళా రైతులను సేవ్ గ్లోబల్ ఫార్మర్స్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మహిపాల్ నరేష్, గణేష్, మనీష్, శేఖర్, రసీల్, మధు, గంగాధర్ పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వ వైభవం వస్తుంది



ఇందూరు(నిజామాబాద్ అర్బన్): రాబోవు రోజుల్లో తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం వస్తుందని పార్టీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అనంతరం కార్యక్రమ కరపత్రాలను విడుదల చేశారు. జిల్లా అధ్యక్షులు దేగాం యాదాగౌడ్, నాయకులు రాజన్న, సురేశ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మంచి నీళ్ల కోసం పడిగాపులు

- పాంగ్రా బ్యాంక్ కాలనీలో 'భగీరథ' పైపులు ఉన్నా అందని నీళ్లు
- ఇబ్బందుల్లో కాలనీవాసులు
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా మంచినీళ్లు సరఫరా చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, పాంగ్రా బ్యాంక్ కాలనీ(4వ డివిజన్)లో మాత్రం మంచినీరు సరఫరా కావటంలేదు. నిజామాబాద్ నగర శివారు పాంగ్రా బ్యాంక్ కాలనీ(4వ డివిజన్) ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా.. నేటికి కాలనీ ప్రజలకు మంచినీటి రుచి అంటే ఏమిటో తెలియదు. ఒకప్పుడు ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఉన్న మాధవనగర్ పాంగ్రా గ్రామాన్ని గత మున్సిపల్ ఎన్నికలకు ముందు మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేశారు. గ్రామాన్ని విలీనం చేయటంతో ఇక తమకు మౌలిక వసతులు అన్ని సమకూరుతాయని భావించిన కాలనీ ప్రజలకు నిరాశే ఎదురైంది. ప్రజల అవసరార్థం కాలనీలో గ్రామ పంచాయతీకి సంబంధించి మూడు వాటర్ ట్యాంక్‌లు నిర్మించారు. వీటి ద్వారా ఇప్పటికీ బోర్ నీళ్లే సరఫరా అవుతున్నాయి.

వాటర్ ట్యాంకు పైపులతో సమస్య...

కాలనీలోని వాటర్‌ట్యాంక్‌పైకి నీళ్లు ఎక్కెందుకు గతంలో వేసిన పైపుల సైజ్‌లు తక్కువగా ఉన్నాయి. దీంతో రెండు సంవత్సరాల క్రితం కాలనీలో మిషన్ భగీరథ పైపులు వేసి దానికి కలిపారు. కానీ మిషన్ భగీరథ నీళ్లు ట్యాంక్‌లోకి కేవలం 25శాతం మాత్రమే పైకి ఎక్కుతున్నాయి. ఈ నీళ్లు కాలనీవాసుల అవసరాలకు సరిపోవు కాబట్టి, మళ్లీ బోర్ నీటినే నింపుతూ, వాటినే ప్రజలకు సరఫరా చేస్తున్నారు. దీంతో కాలనీవాసులకు పూర్తిగా మిషన్ భగీరథ నీళ్లు సరఫరా కావటంలేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి తమకు మిషన్ భగీరథ నీళ్లు సరఫరా చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మంచినీళ్లు సరఫరా చేయాలి..

మా కాలనీలో మంచినీరు సరఫరా కావటం లేదు. మిషన్ భగీరథ పైపులు వేసినా నిరుపయోగంగా ఉంది. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మా కాలనీలు విలీనం చేసినా, ఇప్పటికీ బోర్ నీరే సరఫరా అవుతోంది. అధికారులు స్పందించి కాలనీలో మిషన్ భగీరథ పైపులు వేసి మంచినీటిని సరఫరా చేయాలి.

–శిల్ప, పాంగ్రా బ్యాంక్ కాలనీ



పాంగ్రా బ్యాంక్ కాలనీలోని వాటర్ ట్యాంక్

టెక్నికల్ సమస్య ఉంది..

బ్యాంక్ కాలనీ గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు వాటర్ ట్యాంక్ పైపులు చిన్నవిగా వేశారు. దీంతో మిషన్ భగీరథ పైపులు దానికి కలపటం టెక్నికల్ సమస్యగా మారింది. వాటర్ ట్యాంక్‌పైకి నీళ్లు ఎక్కటానికి కిందినుంచి మిషన్ భగీరథ పైపులు వేస్తే ఈ సమస్య తీరుతుంది. ఆ దిశగా పనులు త్వరలో జరుగనున్నాయి.

–ఇనాయత్, మున్సిపల్ ఏఈ

కాన్షీరాంను స్ఫూర్తిగా తీసుకోవాలి



తెయూలో కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు



మల్లారంలో కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారాన్ని అందేలా కృషి చేసిన గొప్ప రాజనీతిజ్ఞుడు కాన్షీరాంను యువత ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ యూనివర్సిటీ అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్ (ఏఎస్‌ఏ) ఉపాధ్యక్షుడు విజయ్ పేర్కొన్నారు. తెయూలో బుధవారం ఏఎస్‌ఏ ఆధ్వర్యంలో కాన్షీరాం జయంతినిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో..

నిజామాబాద్‌నాగారం: నగరంలో బుధవారం భీమ్ ఆర్మీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాన్షీరాం జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా నాయకులు కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షులు సంజీవ్ ససానే, సాయినాథ్ గాయక్వాడ్, రాజు తిట్టే, గౌతమ్ ఖిల్లారే, విజయ్, గౌతమ్, అజయ్, రాజేందర్, నిర్మల బాయి, సునీత, స్వప్న, అంబికా, సునీత మహిళ విభాగం, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మల్లారంలో..

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం గ్రామంలో బుధవారం మాదిగ సంఘం ఆధ్వర్యంలో కాన్షీరాం జయంతి నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ నగేష్, మండల వైస్ ఎంపీపీ అన్నంసాయిలు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మీసాల మధుకర్‌రావు, మాదిగ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

డిచ్‌పల్లి: విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంపై తగిన శ్రద్ధ చూపాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారం రాథోడ్ సూచించారు. మండలంలోని రాంపూర్‌లో గల మహాత్మాజ్యోతి భాపూలే బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.ఈసందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి తుకారం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.ఉపాధ్యాయులు, ఆరోగ్య విస్తరణ అధికారులు శంకర్, ఆరోగ్య కార్యకర్తలు సుజాత, స్వర్ణలత, స్టాఫ్ నర్స్ వెన్నెల పాల్గొన్నారు.

‘టీఎస్పీఎస్సీ’ని ప్రక్షాళన చేయాలి

- ‘పేపర్ లీకేజీ’ నిందితులను శిక్షించాలి
- విద్యార్థి సంఘాల డిమాండ్



తెయూలో టీఎస్పీఎస్సీ బోర్డు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలను ప్రశ్నార్థకం చేసిన ‘టీఎస్పీఎస్సీ’ పేపర్ లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, టీఎస్పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని ఇందూర్ విభాగ్ ఏబీవీపీ సోషల్ మీడియా కన్వీనర్ నవీన్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీలో టీఎస్‌పీఎస్సీ బోర్డు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి నిందితులపై చర్యలు తీసుకోవాలని, బోర్డు చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

రాష్ట్రంలోని నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న టీఎస్‌పీఎస్సీ బోర్డును పూర్తిగా ప్రక్షాళన చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షులు సంతోష్ డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ వ్యవహారాన్ని నిరసిస్తూ తెయూలో టీఎస్‌పీఎస్సీ బోర్డు దిష్టిబొమ్మను దహనం చేశారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి..

ఖలీల్‌వాడి: ‘టీఎస్పీఎస్సీ’ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జిచే విచారణచేపట్టాలని పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, నగర అధ్యక్షులు అఫూర్ పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ, టీఎస్పీఎస్సీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

నిజామాబాద్‌అర్బన్: ‘టీఎస్పీఎస్సీ’ పేపర్ లీకేజీ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం వారు టీఎస్పీఎస్సీ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ.. ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు.



పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..



ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



డిచ్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది



ధర్పల్లి జూనియర్ కళాశాలలో విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

డిచ్‌పల్లి: మండలంలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్ష కేంద్రాల్లో బుధవారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాతంగా ప్రారంభం అయ్యాయి. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మైనార్టీ గురుకుల పాఠశాల, మోడల్ స్కూల్, ధర్మారం(బి) గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల, ఎస్‌పీఆర్ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మొదటి రోజు పరీక్షకు 1552 మంది విద్యార్థులకు గానూ 1493 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను తహశీల్దార్ శ్రీనివాసరావు, సీఐ మోహన్, ఎస్సై గణేష్, డీఈసీ మెంబర్లు చిన్నయ్య, రవికుమార్‌లు సందర్శించారు.

ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ఆదర్శ పాఠశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. సిబ్బంది ప్రతి విద్యార్థి హాల్ టికెట్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. ఎస్సై వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తును నిర్వహించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు పరీక్ష నిర్వహణ అధికారి చీఫ్ సూపర్ సురేష్ బాబు తెలిపారు.

అక్రమ నిర్మాణాలను కూల్చాలి



గ్రామసభలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ప్రజలు

నిజామాబాద్ సిటీ: గుండారం గ్రామంలో ఇటీవల అక్రమ నిర్మాణాలు పెరిగిపోయాయని వీటిని కూలివ్చేయాలని గ్రామసభ తీర్మానం చేసింది. నిజామాబాద్ రూరల్ మండలం గుండారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ లక్ష్మన్‌రావు అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా గుండారం కొంతమంది ఇంటి నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా రోడ్లను అక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారని, వీటిని వెంటనే కూల్చివేయాలని గ్రామసభలో తీర్మానం చేశారు. అలాగే ఇంటి పన్నులు బకాయిలు ఉన్నవారి నుంచి వందశాతం వసూలు చేయాలని సర్పంచ్ లక్ష్మన్‌రావు పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిలను ఆదేశించారు. ఈ నెలా 21న గ్రామంలో కంటి వెలుగు ప్రారంభం అవుతుందని హెల్త్ సూపర్‌వైజర్ రఘు తెలిపారు. అంగన్‌వాడి సిబ్బంది పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా చేయాలని ఉపసర్పంచ్ శంకర్‌రెడ్డి సూచించారు. కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ స్థలంలో బోర్డు ఏర్పాటు



బోర్డు ఏర్పాటు చేసి వివరాలు తెలుపుతున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఏఈ శ్రీచంద్

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామం సాయినగర్ కాలనీలో ఉన్న ఇరిగేషన్ కాలువ స్థలంలో రెవెన్యూ అధికారులు బుధవారం బోర్డు ఏర్పాటు చేశారు. కొద్ది రోజులుగా గ్రామంలోని స్థానిక రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ఇళ్లు లేని పేదలు ఇరిగేషన్ కాలువ స్థలంలో అనుమతి లేకుండా గుడిసెలు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయమై కాలనీవాసులకు, కబ్జాదారులకు తరచూ గొడవలు జరుగుతుండటంతో బోర్డును ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌రావు తెలిపారు. ప్రస్తుతం కాలువ మూసుకుపోవడంతో స్థానిక ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సూచన మేరకు సర్వే కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపించామన్నారు. అనుమతి రాగానే ఇరిగేషన్ స్థలాన్ని సర్వే చేసి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పేదలకు పంపిణీ చేస్తారని అప్పటి వరకు ఈ స్థలంలో ఎలాంటి కబ్జాలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పనులను శరవేగంగా పూర్తిచేస్తాం



నగరంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ నీతూకిరణ్, కార్పొరేటర్లు

నిజామాబాద్‌నాగారం: నగరంలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తామని మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. నగరంలోని వీక్లీ మార్కెట్‌లో సీసీ కల్వర్ట్ పనులను, అలాగే పలు డివిజన్లలో అభివృద్ధి పనులను బుధవారం మేయర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్బన్ ఎమ్మెల్యే గణేష్ నిధుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకుంటూ నగర అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు.డిప్యూటీ మేయర్ ఇద్రిస్‌ఖాన్, కార్పొరేటర్లు అక్బర్ హుస్సేన్, మృధుల అరుణ్, మున్సిపల్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

సాయి ఆలయ హుండీ లెక్కింపు


నిజామాబాద్ సిటీ: మాధవనగర్ సాయిబాబా దేవస్థానంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. దేవాదాయ సహాయ కమిషనర్ సుప్రియ, ఆలయ ఈవో శ్రీరామ రవీందర్‌ల సమక్షంలో హుండీను తెరిచారు. 45రోజుల తర్వాత హుండీను తెరువగా భక్తులు వేసిన కానుకల ద్వారా రూ. 92,543లు ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు.

కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు



మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమలలో మూడో రోజు బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగాయి. ఈసందర్భంగా అర్చకులు శ్రీవారిని సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. అదే విధంగా స్వామివారిని ఆలయ మాడవీధుల గుండా ఊరేగించి స్వామివారి ఎదురుకోలు కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

నీలకంఠేశ్వర ఆలయంలో రేవంత్‌రెడ్డి పూజలు



నగరంలోని నీలకంఠేశ్వర ఆలయంలో బుధవారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

సమాచారం..

నేడు రుణాల కోసం ఇంటర్వ్యూలు

సిరికొండ: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మైనారిటీ సబ్సిడీ రుణాల కోసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్సు ప్రతులు మూడు సెట్లతో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	58,100	వెండి (కిలో)	67,950
22 క్యారెట్స్	54,557	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	24	క్యాప్సికం	30	50
బెండకాయ	50	70	గాజరుగడ్డ	15	30
జీరకాయ	50	70	పచ్చిమిర్చి	30	50
దొండకాయ	30	50	దోసకాయ	15	30
బీర్నీసుకాయ	50	70	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	10	20	గోబిపువ్వు	25	50
పాలకూర	15	30	బీట్‌రూట్	20	40
మెంతికూర	20	40	గోరు చిక్కుడు	45	70
కొత్తిమీర	10	20	చిక్కుడుకాయ	40	60
పుదీనా	20	40			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సుడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)

స్క్రీన్-1- బలగం- 1.40, 7.30
ఆర్.ఆర్.ఆర్. (తెలుగు)-10.10 సార్- 4.30,10.40
స్క్రీన్-2- తు జూఠి మై మక్కార్(హిందీ) 10.25,4.35,7.40,10.40
65-ఇంగ్లీష్-2డీ-1.45
స్క్రీన్-3-తు జూఠి మై మక్కార్(హిందీ) -1.30
-షాజమ్ ప్యూరీ ఆఫ్ ది జీ-4.35,7.40,10.45

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1-తు జూఠిమే మక్కర్-(హిందీ)-12.50
షాజమ్ ప్యూరీ ఆఫ్-(ఇంగ్లీష్)-4.20,7.15,10.10
స్క్రీన్-2 - తు జూఠి మై మక్కార్(హిందీ) 11.10,2.40,6.10,9.40
స్క్రీన్-3- 65-(తెలుగు)-11.45
దోచేవారెవరు రా-2.00
65-(ఇంగ్లీష్)-4.35
ఆర్ఆర్ఆర్-(తెలుగు)-2డీ-6.50
బలగం -(తెలుగు)-10.30
స్క్రీన్-4- సార్-(తెలుగు)-1.10,7.00
బలగం-(తెలుగు)-4.10
స్క్రీమ్-6 (ఇంగ్లీష్)-4.10

దేవి	సార్
నటరాజ్	65
లలితామహల్	ఆర్.ఆర్.ఆర్
విజయ్	బలగం

అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి



సుభాష్‌నగర్: ‘టీఎస్పీఎస్సీ’ పేపర్ లీకేజీ కారకులు ఎవరని ప్రశ్నించేందుకు వెళ్లిన బీజేవైఎం నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం బీజేవైఎం ఆధ్వర్యంలో నగరంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేవైఎం పోరాటం వల్లే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదలయ్యాయని పేర్కొన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అన్ని ప్రశ్నపత్రాలు లీక్ అవుతున్నాయని ఆరోపించారు. శాంతియుతంగా ఆందోళన చేపట్టేందుకు వెళుతున్న బీజేవైఎం నాయకులను పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు పంపించారని, ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు. వెంటనే కేసులను ఎత్తివేయాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర కార్యదర్శి సుధీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.